9

# సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం, 10, జూలై, 2024



## అశ్రునివాళి



జననం 09-07-1959

మరణం 25-06-2024

### శ్రీ కిలారి వెంకటస్వామి నాయుడు గారు

టి.డి.పి. పార్టీ సీనియర్ నాయకులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, నెల్లూరు

అందరినీ చిరునవ్వుతో పలకరిస్తూ... అందరి మంచి కోరె మనసున్న మనిషి,
ఎల్లపుడు మాకు ప్రేమానురాగాలు, ఆప్యాయతలు పంచుతూ...
నిరంతరం మా కుటుంబ అభ్యున్నతికి కృషి చేసిన మా ఇంటి దైవం
**తేది : 25-06-2024 మంగళవారం** స్వర్గస్థులైనారు.
వారి ఆత్మకు శాంతి కలుగజేయమని భగవంతుని ప్రార్థిస్తూ...

*శ్రద్ధాంజలి ఘటిస్తూ...*

| | |
|---|---|
| భార్య | : కిలారి వనజాక్షి |
| కుమారుడు | : కిలారి వరుణ్‌కుమార్ (రాజా) |
| కుమార్తె - అల్లుడు | : హిందూజ వద్దినేని - శ్రీహరి వద్దినేని |
| మనుమలు | : రేయాన్స్ వద్దినేని, ధ్వనిత్ తేజ వద్దినేని |

మరియు బంధుమిత్రులు

**పెద్దకర్మ :** తేది : 11-07-2024 గురువారం ఉదయం 10-00 గంటలకు నెల్లూరు బి.వి.నగర్ (సాయిబాబా గుడి వెనుక) మా స్వగృహము నందు జరుగును.

## క్లుప్తంగా

### స్వగ్రామానికి వెళ్తుండగా..
• రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అనుమసముద్రంపేట: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన అనుమసముద్రం వద్ద జరిగింది. ఎస్సై ప్రసాద్‌రెడ్డి కథనం మేరకు.. మండలంలోని చౌటభీమవరం గ్రామానికి చెందిన మాదాల కొండస్వామి (49)కి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. అతను సోమవారం సాయంత్రం ఆత్మకూరులోని బంధువుల ఇంటికి మోటార్‌బైక్‌పై వెళ్లాడు. రాత్రి తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. అనుమసముద్రం వద్ద నూతనంగా నిర్మిస్తున్న రోడ్డుపై ప్రమాదవశాత్తు కిందపడగా తలకు బలమైన గాయమైంది. స్థానికులు గుర్తించి 108 అంబులెన్స్‌లో ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. కొండస్వామి మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం చేయించి బంధువులకు అప్పగించారు.

### యువకుడి అనుమానాస్పద మృతి



నెల్లూరు(క్రైమ్): మద్యం మత్తులో ఊపిరాడకో?, ఇతర కారణమో స్పష్టంగా తెలియదు గానీ గుర్తుతెలియని యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన అయ్యప్పగుడి వందన లాడ్జి సమీపంలోని ఐఓబీ ఏటీఎం వద్ద మంగళవారం జరిగింది. స్థానికుల సమాచారంతో వేదాయపాళెం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వయసు 30 నుంచి 35 సంవత్సరాల్లోపు ఉండొచ్చని భావిస్తున్నారు. నలుపు రంగు ఫుల్ హ్యాండ్స్ చొక్కా, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. అతని వివరాలు తెలిసిన వారు వేదాయపాళెం పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని స్థానిక ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణ కోరారు.

### వస్తువులు, నగదు చోరీ

బిట్రగుంట: బోగోలులోని పలు దుకాణాల్లో మంగళవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు వరుస దొంగతనాలకు పాల్పడ్డారు. స్థానికుల కథనం మేరకు.. బోగోలు ప్రధాన కూడలిలోని 144వ రైల్వేగేటుకు సమీపంలో ఉన్న ఒక సెల్‌ఫోన్ దుకాణం, రెండు చిల్లర అంగళ్లలో చిన్నచిన్న వస్తువులు, కొద్దిమొత్తంలో నగదు చోరీ చేయడంతో పాటు పక్కనే ఉన్న మరో షాపులో, ఏటీఎం కేంద్రంలో కూడా చోరీకి విఫలయత్నం చేశారు. కాగా ఈ ఘటనలపై ఫిర్యాదు అందలేదని బిట్రగుంట పోలీసులు తెలిపారు.

### నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

| | |
|---|---|
| బ్రాయిలర్ (లైవ్) | : 134 |
| లేయర్ (లైవ్) | : 115 |
| బ్రాయిలర్ చికెన్ | : 240 |
| బ్రాయిలర్ స్కిన్‌లెస్ | : 268 |
| లేయర్ చికెన్ | : 195 |



### పొదలకూరు నిమ్మధరలు (కిలో)

| | |
|---|---|
| పెద్దవి | : రూ.56 |
| సన్నవి | : రూ.40 |
| పండ్లు | : రూ.30 |



# బాలికలు.. నాట్యంలో మెరికలు

• కూచిపూడిలో సత్తా చాటుతున్న వైనం
• వారి ప్రతిభకు అడ్డంకిగా మారిన పేదరికం

మనుబోలు: ఆ బాలికలిద్దరూ పేదింట జన్మించారు. చిన్నతనం నుంచే నాట్యంపై మక్కువ పెంచుకున్నారు. ప్రదర్శనల్లో ప్రతిభ చూపి అందరి చేత ప్రశంసలు అందుకుంటున్నారు. జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకునేందుకు కృషి చేస్తున్నారు. వారే మండలంలోని మడమనూరు గ్రామానికి చెందిన కందల సుస్మిత, అక్కంపేట గ్రామానికి చెందిన బెల్లంకొండ సంజన. చదువులో రాణించడమే కాకుండా నృత్యంలోనూ సత్తా చాటుతున్నారు.

• మడమనూరు గ్రామానికి చెందిన కందల మనోహర్ – పావని దంపతులకు సుస్మిత సంతానం. మనోహర్ ఆటో నడుపుతుంటాడు. కాగా సుస్మితకు చిన్నతనం నుంచే నాట్యంపై ఆసక్తి ఉంది. దీనిని గమనించిన తల్లిదండ్రులు నెల్లూరులోని శ్రీసిద్ధేంద్రయోగి కూచిపూడి కళాక్షేత్రంలో శిక్షణ ఇప్పించారు. సుస్మిత మడమనూరులోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటూనే నాట్యం నేర్చుకుంది. ప్రస్తుతం ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. 15 ఏళ్లకే విజయవాడ, కడప, శ్రీకాళహస్తి, శ్రీశైలం, తిరుమల, నెల్లూరు, కేరళ, తమిళనాడు తదితర చోట్ల సుమారు 150 ప్రదర్శనలిచ్చింది. సుస్మితను ప్రైవేట్ సంస్థల వారు నర్తనబాల, నర్తన మయూరి అవార్డులతో సత్కరించారు. సంవత్సరం క్రితం అమెరికాలో తానా మహాసభల్లో



తిరుమలలో సంజన నాట్య ప్రదర్శన

నాట్య ప్రదర్శన ఇచ్చేందుకు సుస్మిత ఎంపికైంది. అయితే ఆర్థిక ఇబ్బందుల కారణంగా వెళ్లలేకపోయింది.

• అక్కంపేట గ్రామానికి చెందిన బెల్లంకొండ శ్రీనివాసులు – జయంతి దంపతులకు సంజన సంతానం. శ్రీనివాసులు ఎలక్ట్రికల్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సంజన ఏడేళ్ల వయసులో ఉండగా శివరాత్రికి మనుబోలులో వెంకయ్యస్వామి ఆలయం వద్ద మడమనూరు గ్రామానికి చెందిన సుస్మిత ప్రదర్శన చూసింది. దీంతో నాట్యంపై మక్కువ పెంచుకుంది. చిన్నారి ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు సుస్మిత నాట్యం నేర్చుకున్న చోటే శిక్షణ ఇప్పించారు. ప్రస్తుతం అక్కంపేటలో 6వ తరగతి చదువుతున్న సంజన ఇప్పటి వరకూ 25 ప్రదర్శనలిచ్చింది. గతేడాది కేరళలోని అనంతపద్మనాభస్వామి ఆలయం వద్ద సుస్మితతో కలిసి వెళ్లి నాట్య ప్రదర్శన చేసి అందరి చేత శభాష్ అనిపించుకుంది. చిన్న వయసులోనే నాట్యంలో ప్రతిభ చూపుతున్న ఇద్దరు బాలికల తల్లిదండ్రులూ పేదవారు. దీంతో సుదూర ప్రాంతాల్లో నాట్య ప్రదర్శనలిచ్చేందుకు వారి ఆర్థిక స్తోమత అడ్డంకిగా మారుతోంది. దాతలు స్పందించి ఈ బాలికలకు స్పాన్సర్‌షిప్ కల్పిస్తే వారు మరింత ఉన్నత శిఖరాలకు చేరుకునే అవకాశం ఉంది.



సుష్మిత

### డ్యాన్స్ టీచర్ కావాలనుంది

చిన్నతనం నుంచే శాస్త్రీయ నృత్యాలు అంటే ఎంతో మక్కువ. టీవీలో క్లాసికల్ డ్యాన్స్‌ను ఎంతో ఆసక్తితో చూస్తుంటాను. నా ఆసక్తిని, అభిరుచిని అర్థం చేసుకున్న అమ్మానాన్న కూచిపూడి నాట్యంలో శిక్షణ ఇప్పించారు. చాలాచోట్ల ప్రదర్శనలిచ్చాను. కూచిపూడిలో జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకోవాలని ఉంది. అలాగే భవిష్యత్‌లో డ్యాన్స్ టీచర్‌నై ఎంతోమంది నృత్య కళాకారులను తయారు చేయాలని ఉంది. – సుస్మిత

### సుస్మిత స్ఫూర్తితోనే..

మనుబోలులో శివరాత్రి రోజు సుస్మిత కూచిపూడి నాట్య ప్రదర్శన చూశాను. అప్పటి నుంచి నాకు నృత్యం చేయాలనిపించింది. తల్లిదండ్రులతో చెబితే కూచిపూడి కళాక్షేత్రంలో చేర్పించారు. చాలీచాలని సంపాదనతో నాకు నృత్యం నేర్పించడం అమ్మానాన్నకు కష్టంగా ఉంటోంది. దాతలు సహకరిస్తే మరిన్ని ప్రదర్శనలిచ్చి గుర్తింపు తెచ్చుకుంటాను. – సంజన

# ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): ఓ వ్యక్తి ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో పెన్నానదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. బుచ్చిరెడ్డిపాళెం దామరమడుగుకు చెందిన ఎస్.నిర్మలమ్మకు ఇద్దరు కుమార్తెలు, శ్రీనివాసులు (40) సంతానం. కుమార్తెలకు వివాహమైంది. శ్రీనివాసులు నెల్లూరు నగరంలో ఎలక్ట్రీషియన్ పనులు చేస్తున్నాడు. ఆరు సంవత్సరాల క్రితం అతడికి నారాయణరెడ్డిపేటకు చెందిన యువతితో వివాహమైంది. అయితే కొద్దిరోజులకే దంపతుల నడుమ విభేదాలు వచ్చాయి. దీంతో భార్య శ్రీనివాసులును వదిలి వెళ్లిపోయింది. అప్పటి నుంచి అతను కుంగిపోయాడు. సంపాదించిన మొత్తాన్ని వ్యసనాలకు వెచ్చించసాగాడు. ఇటీవల మోటార్‌బైక్‌ను సైతం కుదువపెట్టాడు. తెలిసిన వారి వద్ద అప్పులు చేశాడు. ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టాయి. రెండు, మూడురోజులకోసారి ఇంటికి వచ్చేవాడు. అధిక శాతం నెల్లూరులోనే ఉండసాగాడు. ఈ నేపథ్యంలో పని ఉందని తల్లికి చెప్పి రెండురోజుల క్రితం నెల్లూరుకు వచ్చాడు. ఏం జరిగిందో ఏమో గానీ పెన్నానదిలో మంగళవారం శ్రీనివాసులు శవమై తేలాడు. నీటిపై మృతదేహం తేలియాడుతుండగా గమనించిన స్థానికులు డయల్ 112కు సమాచారం అందించారు. సంతపేట ఇన్‌స్పెక్టర్ ఎ.సుబ్బరాజు తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. స్థానికుల సహకారంతో మృతదేహాన్ని వెలికితీయించారు. కొంత దూరంలోని గోడపై మృతుడి చొక్కా, మెడలో ధరించే కాశీ దారం, టెస్టర్ ఉన్నాయి. గోడపై ఫోన్ నంబర్ రాసి ఉంది. దానికి కాల్ చేయగా నిర్మలమ్మ మాట్లాడారు. పోలీసులు ఆమెకు జరిగిన విషయాన్ని తెలియగా వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని విగతజీవిగా పడి ఉన్న కుమారుడిని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. ఆర్థిక ఇబ్బందులతోనే శ్రీనివాసులు ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసుల విచారణలో తేలింది. సంతపేట హెడ్‌కానిస్టేబుల్ బాబు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సంతపేట ఇన్‌స్పెక్టర్ సుబ్బరాజు

# అనుమానంతో గొంతుకోసి హత్య

• భార్యను కిరాతకంగా చంపిన భర్త అరెస్ట్
• వివరాలు వెల్లడించిన డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి

మదనపల్లె: మగవారితో చనువుగా మాట్లాడుతోందని.. నెల్లూరుకు చెందిన ఓ వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుందనే అనుమానంతో ఓ వ్యక్తి భార్య గొంతుకోసి హత్య చేసినట్లు పోలీసు విచారణలో వెల్లడైంది. నిమ్మనపల్లె మండలం దివిటివారిపల్లె వ్యవసాయ పొలాల్లో జూన్ 27న జరిగిన మహిళ హత్య కేసును పోలీసులు ఛేదించారు. మదనపల్లె రూరల్ సర్కిల్ కార్యాలయంలో కేసు వివరాలను డీఎస్పీ ప్రసాదరెడ్డి మంగళవారం వెల్లడించారు. చిత్తూరు జిల్లా పలమనేరు పట్టణం నాగరాళ్లవీధికి చెందిన పి.మునిరత్నం కుమారుడు పి.గణపతి (37) అలియాస్ వెంకటేష్‌కు అదే జిల్లా పెనుమూరు మండలం కార్తికేయపురానికి చెందిన వెంకటయ్య, సాలమ్మల కుమార్తె భారతి (26)ని ఇచ్చి తొమ్మిదేళ్ల క్రితం వివాహం చేశారు. వీరికి ఇద్దరు కుమారులున్నారు. గణపతి ఇటీవల మద్యం తాగుతూ జులాయిగా మారాడు. భారతి పలమనేరు బస్టాండ్‌లో పూలమ్ముతూ జీవనం సాగిస్తోంది. అయితే పూలు అమ్మే సమయంలో మగవారితో చనువుగా మాట్లాడుతోందని గణపతి ఆమెపై అనుమానం పెంచుకుని వేధించాడు. విసిగిపోయిన భారతి ఏడాదిన్నర క్రితం పిల్లలను భర్త వద్దే వదిలి నెల్లూరు జిల్లా కోవూరులో ఉంటున్న తల్లి సాలమ్మ వద్దకు వెళ్లింది. భర్త పిలిచినప్పుడల్లా పలమనేరుకు వచ్చి పిల్లలను చూసి వెళ్తుండేది.

**పిల్లలను పంపుతానని..**

కోవూరులో భారతి స్థానికుడు రవితో సన్నిహితంగా ఉందని గణపతి అనుమానం పెంచుకున్నాడు. ఆమెను కడతేర్చాలని నిర్ణయించుకున్నాడు. పిల్లలను నీ వద్దకు పంపుతా.. తీసుకెళ్లాలంటూ చెప్పి జూన్ 27న భార్యను రప్పించాడు. నెల్లూరు నుంచి రైలులో వచ్చిన భారతి చౌడేపల్లెకు వచ్చి భర్తను కలుసుకుంది. మదనపల్లెలో తెలిసిన వారి వద్ద పిల్లలున్నారని చెప్పి మోటార్‌బైక్‌పై ఎక్కించుకుని నిమ్మనపల్లె మండలం దివిటివారిపల్లె సమీపంలోని వ్యవసాయ పొలంలో పశువుల పాక వద్దకు తీసుకెళ్లాడు. వివాహేతర సంబంధంపై నిలదీయడంతో భార్యాభర్తల మధ్య వాగ్వాదం జరిగింది. ఆగ్రహంతో ఊగిపోయిన గణపతి వెంట తెచ్చుకున్న కత్తితో భారతి గొంతుకోసి చంపేశాడు. ఆ సమయానికి పొలానికి నీళ్లు పెట్టేందుకు వచ్చిన రామాంజనేయులుపైనా కత్తితో దాడి చేశాడు. అతడు కేకలు వేయడంతో గణపతి పారిపోయాడు. మృతురాలి తల్లి సాలమ్మ ఫిర్యాదు మేరకు నిమ్మనపల్లె పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. రూరల్ సర్కిల్ సీఐ సద్గురుడు, ఎస్సై లోకేష్‌రెడ్డి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గణపతిని బైపాస్‌రోడ్డులోని నిమ్మనపల్లె సర్కిల్ వద్ద అరెస్ట్ చేశారు. హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకుని, నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ చక్రవర్తి, పీసీలు రాజేష్, శివ, నరేష్ పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, సీఐ సద్గురుడు, చిత్రంలో ఎస్సై, పోలీస్ సిబ్బంది

# నెల్లూరు రీజియన్‌కు 110 కొత్త బస్సులు

రాపూరు: నెల్లూరు ఆర్టీసీ రీజియన్‌కు 110 కొత్త బస్సులు రానున్నట్లు ఆర్‌ఎం వెంకటరత్నం తెలిపారు. రాపూరు ఆర్టీసీ డిపోను ఆయన మంగళవారం తనిఖీ చేసి, కార్మికులకు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవసరాన్ని బట్టి కొత్త బస్సులు ఆయా డిపోలకు అందిస్తామన్నారు. అలాగే మరో 14 బస్సులు అవసరమని ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు. నెల్లూరు జిల్లాలో అన్ని డిపోలకంటే రాపూరు డిపో లాభాలబాటలో ఉందన్నారు. ఈ సందర్భంగా డిపోలో అత్యధిక కలెక్షన్ తీసుకొచ్చిన ముగ్గురు కండక్టర్లకు, డీజిల్ పొదుపు చేసిన ముగ్గురు డ్రైవర్లకు, ఒక మెకానిక్‌కు ఆర్‌ఎం చేతుల మీదుగా నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న ఆర్‌ఎం

# కండలేరులో 6.321 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం 6.321 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 5 క్యూసెక్కులు, లోలెవల్ కాలువకు 15 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# వైఎస్సార్‌సీపీ నాయకుడి ఇంటిపై దాడి

• టీడీపీ వారి నిర్వాకం
• దుకాణంలోని వస్తువులను ధ్వంసం చేసిన వైనం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ పిశ్శెల్ల సాగర్ ఇంటిపై టీడీపీ కార్యకర్తలు ఆదివారం అర్ధరాత్రి దాడి చేశారు. దీనికి సంబంధించి బాధితుడు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అందులోని వివరాల మేరకు.. కామాక్షితాయి ఆలయ సమీపంలో సాగర్ మొదటి అంతస్తులో నివాసం ఉంటున్నాడు. కింద దుకాణం ఉంది. టీడీపీకి చెందిన సింగిరి ప్రసాద్, సింగిరి శ్రీనివాసులు, మద్దిశెట్టి అనిల్ తదితరులు సాగర్ ఇంట్లోకి చొరబడి మొదట దుకాణంలోని వస్తువులను పగులగొట్టారు. భయపడిపోయిన సాగర్, అతని తల్లిదండ్రులు ఇంట్లో తలుపులకు గడియ పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడిపారు. అతడిని బయటికి రావాలని.. అంతు చూస్తామని టీడీపీ నాయకులు పెద్దగా కేకలు వేస్తూ బెదిరింపులకు దిగారు. బూతులు తిడుతూ 20 నిమిషాలపాటు భయానక వాతావరణం సృష్టించారు. ఈ విషయమై బాధితుడు బుచ్చిరెడ్డిపాళెం పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశాడు. విచారించి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.



దుకాణం వద్ద బాధితుడు సాగర్

# రోగులకు మెరుగైన వైద్యసేవలు



చిన్నారిని పలకరిస్తున్న కలెక్టర్ ఆనంద్

• కలెక్టర్ ఆనంద్ సూచన
• వెంకటాచలం మండలంలో విస్తృత పర్యటన

వెంకటాచలం: ప్రభుత్వాస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ ఒ.ఆనంద్ సూచించారు. ఆయన మంగళవారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. తొలుత వెంకటాచలం పంచాయతీ వడ్డిపాళెంలోని అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లారు. అక్కడ చిన్నారులకు సంబంధించిన రిజిస్టర్ పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ చిన్నారులను బాగా చూసుకోవాలని సూచించారు. తర్వాత వెంకటాచలంలోని క్లస్టర్ ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవల గురించి ఆరాతీశారు. చెముడుగుంట వద్ద నున్న జిల్లా సైన్స్ మ్యూజియం, జెడ్పీ ఉన్నత పాఠశాలను చూశారు. మధ్యాహ్న భోజన పథకం నాణ్యతను పరిశీలించారు. భోజనం రుచిగా ఉందా? లేదా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కిట్లు అందరికీ అందాయా? అని అధికారులను ప్రశ్నించారు. బ్యాగ్‌లు తప్ప మిగిలినవి ఇచ్చామని ప్రధానోపాధ్యాయురాలు అరుణ కలెక్టర్‌కు వివరించారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులను సైన్స్ మ్యూజియంకు తీసుకొచ్చి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. అంగన్‌వాడీలు, ప్రభుత్వ పాఠశాలలు, సీహెచ్‌సీలను పరిశీలించి వాటిల్లో పరిస్థితులను తెలుసుకుంటున్నట్లు తెలిపారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన చేసి మంచి ఫలితాలు రాబట్టాలని టీచర్లకు సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు పక్కాగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ హేనాసుజన్, డీసీహెచ్‌ఎస్ రమేష్‌నాథ్, డీఈఓ రామారావు, పలువురు అధికారులున్నారు.

# గుర్తుతెలియని మృతదేహం లభ్యం

గుడ్లూరు(కందుకూరు): మండలంలోని శాంతినగర్ ఎస్టీ కాలనీలో సమీపంలో జామాయిల్‌తోటలో కుళ్లిన స్థితిలో ఉన్న గుర్తుతెలియని మృతదేహాన్ని మంగళవారం స్థానికులు గుర్తించారు. వారి నుంచి సమాచారం అందుకున్న కందుకూరు డీఎస్పీ శ్రీనివాస్, గుడ్లూరు సీఐ బీవీ సుబ్బారావు ఘటనా చేరుకుని పరిశీలించారు. మృతుడు పచ్చని రంగు టీషర్టు, నీలిరంగు జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. ఎప్పుడు చనిపోయాడో తెలియదు. ప్రస్తుతం మృతదేహం కుళ్లిపోయి ఎముకలు మాత్రమే మిగిలి ఉన్నాయి. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై లక్ష్మణరావు తెలిపారు.



**సోమశిలలో 9.980 టీఎంసీలు**

సోమశిల: జలాశయంలో మంగళవారానికి 9.980 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 202 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది. దిగువకు 610 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



**బంగారం ధరలు**

| | |
|---|---|
| 24 క్యారెట్లు (10 గ్రా) | రూ.74,780 |
| 22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా) | రూ.6,716 |
| 3 శాతం జీఎస్టీతో | రూ.6,917 |
| నవర (8 గ్రా) | రూ.55,336 |

గరిష్టం/కనిష్టం
33.5 /27.7

**వాతావరణం**

జిల్లా వ్యాప్తంగా బుధవారం వాతావరణం పొడిగా ఉన్నా.. ఆకాశం అక్కడక్కడ మేఘావృతమై ఉంటుంది. వాతావరణంలో తేమ 64 శాతం ఉంది.

## న్యూస్‌రీల్

### రేపటి నుంచి పాలిటెక్నిక్ రెండో విడత కౌన్సెలింగ్

నెల్లూరు సిటీ: పాలిటెక్నిక్ కళాశాలలో అడ్మిషన్లకు ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించనుంది. ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లింపులు, సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టనున్నారు. 11 నుంచి 14వ తేదీ వరకు ఆప్షన్ ఎంట్రీ, 16వ తేదీ సీట్లు కేటాయింపు జరుగుతుంది. 18 నుంచి 20వ తేదీలోపు ఆయా కళాశాలలో విద్యార్థులు రిపోర్టింగ్ చేయాలి. ఫీజు చెల్లింపులు 'ఏపీపీఓఐవైసెట్.ఎన్‌ఐసీ.ఇన్'లో చెల్లించవచ్చు. ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.700, ఎస్సీ, ఎస్టీలు రూ.250 చెల్లించాలి.

### దుర్గంపల్లిలో కొండచిలువ



కంపచెట్లలో ఉన్న కొండ చిలువ

ఉదయగిరి: మండలంలోని దుర్గంపల్లి గ్రామ సమీపంలో కొండచిలువ కనిపించడంతో గ్రామస్తులు భయకంపితులవుతున్నారు. రెండ్రోజుల క్రితం గ్రామం సమీపంలోని కోనేరు వద్ద కొండ చిలువ సంచరిస్తూ ఓ మేక పిల్లను పట్టుకుంది. మేక పిల్ల అరుపులకు సమీపంలో ఉన్న యువత అక్కడికి చేరుకుని కొండ చిలువ బారి నుంచి మేక పిల్లను రక్షించారు. కొండ చిలువ తిరుగుతుండడంతో జీవాల యజమానులు, ప్రజలు అటవీ ప్రాంతానికి వెళ్లేందుకు భయపడుతున్నారు.

### పొగాకు ధర గరిష్టంగా రూ.365



పొదిలి పొగాకు బోర్డులో వేలానికి సిద్ధంగా ఉన్న బేళ్లు

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరిధిలో పొగాకు ధర మంగళవారం గరిష్టంగా కేజీ రూ.365 పలికిందని ఆర్‌ఎం లక్ష్మణరావు తెలిపారు. రీజియన్ పరిధిలో 3,669 బేళ్లు రాగా, 3,246 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 423 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. ఒంగోలు, కొండపి కేంద్రాల్లో 101వ రోజు వేలంలో 2,821 బేళ్లు రాగా 2,508 బేళ్లు కొనుగోలు చేయగా 313 బేళ్లను కొనుగోలుకు తిరస్కరించారు. కేజీ గరిష్ట ధర రూ.365, కనిష్టంగా రూ.205 సగటున రూ.310.12 లభించింది. వెల్లంపల్లి, పొదిలి, కనిగిరి తదితర కేంద్రాల్లో 96వ రోజు వేలంలో 848 బేళ్లు రాగా, 738 బేళ్లు కొనుగోలయ్యాయి. 110 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. గరిష్టంగా రూ.365, కనిష్ట ధర రూ.205, సగటున రూ.303.52 పలికింది.

### నేడు వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశం

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ ఆత్మకూరు నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమావేశాన్ని బుధవారం ఉదయం 10.30 గంటలకు మున్సిపల్ పరిధిలోని శ్రీధర్ గార్డెన్స్‌లో నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కార్యాలయ ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సమావేశానికి నియోజకవర్గంలోని అన్ని మండలాలు, ఆత్మకూరు పట్టణంలోని నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్, జెడ్పీ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మానుగుంట మహీధర్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీలు తూమాటి మాధవరావు, బల్లి కల్యాణ్‌చక్రవర్తి, మేరిగ మురళీధర్, మాజీ జెడ్పీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, ఉదయగిరి, నెల్లూరు ఇన్‌చార్జిలు మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, ఖలీల్‌అహ్మద్ తదితరులు పాల్గొననున్నారని తెలిపారు.

### 30 మండలాల్లో చిరుజల్లులు

ఒంగోలు సెంట్రల్: జిల్లాలో పలు మండలాల్లో అడపాదడపా వర్షాలు పడుతున్నాయి. జిల్లాలోని 38 మండలాలకు గాను 30 మండలాల్లో సోమవారం మోస్తరు వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. అత్యధికంగా పొన్నలూరు మండలంలో 54.4 మి.మీ. నమోదు కాగా అత్యల్పంగా పామూరు, కురిచేడు మండలాల్లో 1 మి.మీ. నమోదైంది.

# కోళ్ల వ్యర్థాలతో రూ.కోట్లు

కోవూరు అడ్డాగా కోళ్ల వ్యర్థాల వ్యాపారం రూ.కోట్లలో సాగుతోంది. ప్రజారోగ్యం, పర్యావరణానికి ముప్పుగా పరిణమించే ఈ వ్యాపారాన్ని అడ్డుకోవాల్సిన పోలీసులు, మత్స్యశాఖాధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు. అధికార పార్టీలోని కోవూరుకు చెందిన ఓ చోటా నేత పక్క రాష్ట్రాల్లో కోళ్ల వ్యర్థాల సేకరణ కేంద్రాలు తెరిచి మాఫియాగా అవతరించాడు. ఆయా రాష్ట్రాల నుంచి నిత్యం టన్నుల కొద్దీ ఈ వ్యర్థాలను జిల్లాకు తెచ్చి వ్యాపారం సాగిస్తున్నాడు. కొన్నేళ్లుగా చూస్తే కోళ్ల వ్యర్థాల రవాణాపై ఫిర్యాదులొచ్చినా.. ఇప్పటి వరకు ఒక్క పోలీస్‌స్టేషన్‌లో కూడా కేసు నమోదు కాలేదంటే ఏ స్థాయిలో అధికారులకు ముడుపులు అందుతున్నాయో అర్థం చేసుకోవచ్చు.



**కోవూరు అడ్డాగా నెలకు రూ.10 కోట్ల వ్యాపారం**

- అధికార పార్టీ చోటా నేత చికెన్ వేస్ట్ మాఫియాగా అవతారం
- పక్క రాష్ట్రాల నుంచి నిత్యం జిల్లాకు రోజుకు టన్నుల కొద్దీ వ్యర్థాలు
- చేపలకు ఆహారంగా వాడుతున్న వైనం
- పోలీసులు, మత్స్య శాఖ అధికారులకు రూ.లక్షల్లో మామూళ్లు
- వాహనం దొరికినా కేసులు లేవంటూ వదిలేస్తున్న వైనం
- ఆదివారం రాత్రి జిల్లాకు 50 పైగా వాహనాలు
- ఎమ్మెల్యే కాటాక్షం కోసం ప్రయత్నాలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: పక్క రాష్ట్రాల్లో పారేసే చికెన్ వేస్ట్‌తో ఓ చోటా నేత రూ.కోట్లు గడిస్తుంటే.. జిల్లాలోని పోలీస్, మత్స్యశాఖాధికారులకు కాసులు కురిపిస్తున్నాయి. పక్క రాష్ట్రాల నుంచి నిత్యం టన్నుల కొద్దీ కోళ్ల వ్యర్థాలను జిల్లాకు తరలిస్తున్నారు. అధికార యంత్రాంగం అవినీతికి స్వచ్ఛమైన పల్లెసీమల వాతావరణం కలుషితంగా మారుతోంది. జిల్లాను ముంచెత్తుతున్న కుళ్లిన వ్యర్థాలతో ప్రజారోగ్యానికి చేటుగా పరిణమిస్తోంది. తాజాగా డయేరియా విజృంభిస్తోండడంతో జిల్లా ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

**చేపలకు ఆహారంగా కోళ్ల వ్యర్థాలు**

జిల్లాలో కోవూరు, ఇందుకూరుపేట, విడవలూరు, ముత్తుకూరు, తోటపల్లిగూడూరు, బుచ్చిరెడ్డిపాళెం, సంగం ప్రాంతాల్లో పెద్ద ఎత్తున రొయ్యల తర్వాత రెండు వేల ఎకరాల్లో చేపల పెంపకం జరుగుతోంది. అయితే చేపలకు వినియోగించే ఫీడ్ ఖరీదు కావడంతో వీటి పోషణ రైతులకు భారంగా మారింది. చేపల మేతగా బ్రాండెడ్ ఫీడ్‌కు ప్రత్యామ్నాయంగా అతి తక్కువ ఖర్చుతో కూడిన కోళ్ల వ్యర్థాలను వినియోగిస్తున్నారు.



ఇటీవల పోలీసులు స్వాధీనం చేసుకున్న కోళ్ల వ్యర్థాల వాహనం (ఫైల్)

**పొరుగు రాష్ట్రాల నుంచి జిల్లాకు డంప్**

పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల నుంచి కోళ్ల వ్యర్థాలను జిల్లాకు నిత్యం టన్నుల కొద్దీ డంప్ చేస్తున్నారు. ఇటు తమిళనాడు నుంచి ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని తడ మీదుగా చెన్నై–కోల్‌కత్తా హైవేలో నెల్లూరు చుట్టు పక్కల ప్రాంతాలకు చేరుకుంటున్నాయి. ఈ మధ్యలో మూడు టోల్‌గేట్లు ఉన్నాయి. కేరళ, కర్ణాటక నుంచి తిరుపతి, శ్రీకాళహస్తి, నాయుడుపేట మీదుగా, కర్ణాటక నుంచి వైఎస్సార్ జిల్లా మీదుగా మర్రిపాడు నుంచి జిల్లాలోకి ఈ వాహనాలు వస్తున్నాయి. కోళ్ల వ్యర్థాలు అప్పటికే కుళ్లి దుర్గంధం వెదజల్లుతున్నప్పటికీ ప్లాస్టిక్ డ్రమ్ముల ద్వారా వాహనాల్లో రాత్రి పూట తరలిస్తున్నారు. కోళ్ల వ్యర్థాలు తరలించే వాహనాలు జాతీయ రహదారిపై రవాణా చేస్తుంటే.. భరించలేని దుర్గంధం వెదజల్లుతోంది. ఆ వాహనం వెళ్లినంత దూరం పావు గంట వరకు ఈ దుర్గంధం తగ్గడం లేదు. తమిళనాడు నుంచి 20 వాహనాలు, కేరళ నుంచి 10 వరకు, కర్ణాటక నుంచి 10–15 వాహనాలు నిత్యం రవాణా చేస్తున్నట్లు సమాచారం. ఒక్కొక్క వాహనంలో 20 టన్నుల నుంచి 30 టన్నుల వరకు తరలిస్తున్నారు. రోజు వారీగా కంటే ఆదివారం రోజుల్లో దాదాపు 50 పైగా వాహనాలు వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఈ మాఫియా కు నెలకు రూ. కోట్లలో ఆదాయం వస్తోంది.

**ఇతర రాష్ట్రాల్లో వ్యర్థాల కలెక్షన్ పాయింట్లు**

టీడీపీలోని కోవూరుకు చెందిన ఓ చోటా నేత కనుసన్నల్లో ఈ వ్యాపారం జరుగుతోంది. బుచ్చిరెడ్డిపాళానికి చెందిన మరో వ్యక్తితో కలిసి కొన్నేళ్లుగా మాఫియాగా తయారై వ్యాపారం సాగిస్తున్నాడు. బెంగళూరు, చెన్నై, కేరళ ప్రాంతాల్లో ఈ మాఫియా కోళ్ల వ్యర్థాల సేకరణకు కలెక్షన్ పాయింట్లు ఏర్పాటు చేసింది. ఇందు కోసమే రూ.కోట్ల వెచ్చించినట్లు సమాచారం. వ్యర్థాల సేకరించేందుకు ఎక్కడికక్కడ టీమ్‌ను ఏర్పాటు చేసుకుని, కేజీ రూ.5 వంతున సేకరించి డంపింగ్ యార్డుల్లో నిల్వ చేస్తారు. అక్కడి నుంచి రాత్రి వేళల్లో లోడింగ్ చేసి నెల్లూరుకు చేర్చుతున్నారు. ఇలా జిల్లాకు చేరుకునే సరికి కేజీకి రూ.10 ఖర్చవుతోంది. చేపలు సాగు చేసే రైతులకు కేజీ రూ.25 నుంచి 30 వరకు విక్రయిస్తున్నారు. ఈ లెక్కన నెలకు రూ.10 కోట్ల వ్యాపారం జరుగుతున్నట్లు సమాచారం. కోవూరు చెందిన ఈ మాఫియాకు నెలకు రూ.కోట్లలో ఆదాయం వస్తుండడంతో మరి కొందరు ఈ వ్యాపారంపై దృష్టి పెడుతున్నట్లు సమాచారం. కోవూరులో అధికార



ఇందుకూరుపేట మండలం కొమరిక ప్రాంతంలో చేపల చెరువులో డంప్ చేస్తున్న కోళ్ల వ్యర్థాలు

**నెలకు రూ.లక్షల్లో మామూళ్లు**

ఈ వాహనాలు రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న చెక్‌పోస్టులు, టోల్‌గేట్లు దాటుకుని జిల్లాలోకి వస్తున్నప్పుడు వాటిని కట్టడి చేసే అవకాశం ఇటు పోలీసులకు, అటు మత్స్యశాఖ అధికారులకు ఉంది. అయితే పోలీస్ శాఖకు ఒక్కో వాహనానికి రూ.3 వేలు వంతున నెలకు ఒక స్టేషన్‌కు రూ.3 లక్షలు, సర్కిల్, డీఎస్పీ స్థాయి అధికారులకు ప్రత్యేకంగా మామూళ్లు ఇస్తున్నారనే ఆరోపణలున్నాయి. బెంగళూరు నుంచి కడప సరిహద్దు ప్రాంతం నుంచి వాహనాలు వస్తాయి. చెన్నై, కేరళ నుంచి జాతీయ రహదారి నుంచే వాహనాలు వస్తాయి. ఆయా ప్రాంతాల్లో ప్రతి స్టేషన్‌కు, సర్కిల్‌కు నెలవారీ మామూళ్లు ఇస్తుండడంతో ఏ అధికారి కూడా ఆ వాహనాల జోలికి వెళ్లడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మత్స్యశాఖ అధికారులకు నెలకు రూ.లక్షల్లో మామూళ్లు ముట్టజెప్పుతున్నట్లు సమాచారం అడపాదడపా రోడ్డు ప్రమాదాలు జరిగో, వాహనం మరమ్మతులకు గురైతే మాత్రం వ్యర్థాల రవాణా వెలుగులోకి వస్తున్నాయి. ఒక వేళ వ్యర్థాల వాహనాల నుంచి వచ్చే దుర్గంధం భరించలేక పోలీసులకు వాహనాలు పట్టించినా వదిలేస్తున్నారు. రెండు రోజుల క్రితం విడవలూరులో కోళ్ల వ్యర్థాల వాహనాన్ని స్థానికులు పట్టించినా స్థానిక ఎస్‌ఐ వదిలేయడం వెనుక భారీగానే కాసులు ముట్టాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పార్టీకి చెందిన నేతలను ప్రసన్నం చేసుకుని వారికి రూ.లక్షల్లో ముట్టజెప్పి వారి అండతో ఈ మాఫియా చెలరేగిపోతున్నట్లు సమాచారం.

**ఎమ్మెల్యే అండదండలకు పాకులాట**

కోవూరుకు చెందిన ఈ మాఫియా స్థానిక ఎమ్మెల్యే అండదండల కోసం పాకులాడుతున్నట్లు సమాచారం. సదరు వ్యక్తి టీడీపీకి చెందిన వాడే కావడంతో స్థానిక నేతల సహకారంతో మనోడే అని చెప్పించి ఇటీవల స్థానికులు పట్టించిన కోళ్ల వ్యర్థాల వాహనాన్ని కేసుల్లేకుండా వదిలేయించినట్లు సమాచారం. భవిష్యత్‌లో కూడా ఎటువంటి కేసులు నమోదు కాకుండా స్థానిక పోలీస్ అధికారులకు చెప్పించే ప్రయత్నం జరుగుతున్నట్లు తెలిసింది.

# జీతమో.. చంద్ర

- వేతనాల కోసం అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఎదురుచూపులు
- గత ప్రభుత్వంలో ప్రతి నెలా 1వ తేదీనే జీతాలు
- కొత్తగా ఏర్పడిన ప్రభుత్వంలో ఎప్పుడనేది స్పష్టత లేని వైనం
- నగర పాలక సంస్థలో పనిచేస్తున్న 2,245 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

నెల్లూరు (బారకాసు): పదో తేదీ వచ్చినా.. జీతాలు అందక నెల్లూరు నగర పాలక సంస్థలో ఆప్కాస్ ద్వారా నియమితులైన అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వంలో వీరికి ప్రతి నెలా 1వ తేదీన ఠంఛన్‌గా జీతాలు వస్తుండేవి. అయితే కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం వీరి జీతాల గురించి పట్టించుకోకపోవడం, ఎప్పుడిస్తారనే విషయంపై స్పష్టత లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

**2,245 మంది ఆప్కాస్ ఉద్యోగులు**

నెల్లూరు నగర పాలక సంస్థలో ఆప్కాస్ ద్వారా అవుట్ సోర్సింగ్ విధానంలో నియమితులైన 2,245 మంది ఉద్యోగులు పలు విభాగాల్లో వివిధ క్యాడర్లలో విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి క్యాడర్‌ను బట్టి రూ.15 వేలు నుంచి రూ.24,500 వరకు జీతం ఇస్తున్నారు. ఇలా మొత్తం నెలకు దాదాపు రూ.4 కోట్లకు పైగా వీరికి జీతాలు ఇవ్వాల్సి ఉంది. ప్రతి నెలా ఒకటో తేదీన జీతం తీసుకుంటున్న వీరంతా ఇప్పుడు నెల ప్రారంభమై పది రోజులు గడుస్తున్నా.. జీతం లేకపోవడంతో కుటుంబ అవసరాలు, పోషణకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంటి బాడుగ, బియ్యం, పాలు, గ్యాస్, డిష్, ఫోన్ బిల్లు, నిత్యావసర సరుకులు, స్కూల్, కాలేజీ ఫీజులు తదితర అవసరాలు తీర్చుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. చేతిలో చిల్లిగవ్వ లేకుండా ఉండే సరికి ఏం చేయాలో అర్థం కాని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. అప్పు చేద్దాం అనుకుంటే వీరికి డబ్బు ఇచ్చే వారు కరువయ్యారు. ఇటువంటి పరిస్థితి ఎదురవుతుందని ఊహించలేదని పలువురు ఆప్కాస్ ఉద్యోగులు ఆంతర్గతంగా మదన పడుతున్నారని సమాచారం.

**ఎప్పటికి వచ్చేను జీతాలు?**

నగర పాలక సంస్థలో పనిచేస్తున్న సదరు ఉద్యోగులకు జీతాలు ఎప్పటికి వస్తాయోనని సందేహం అందరిలో నెలకొంది. గతంలో వీరి జీతాలు జనరల్ ఫండ్‌లో నుంచి ఇస్తుండేవారు. అయితే జూలై ఒకటవ తేదీన రావాల్సిన జీతాలు సీఎఫ్‌ఎంఎస్‌లో పెండింగ్‌లో ఉందని సమాచారం. ఇలా ఎందుకు ఆలస్యమవుతుందనేది ఎవరికీ అర్థం కాని సమస్య. ఆప్కాస్ ఉద్యోగుల జీతాల విషయంలో రాష్ట్ర ఉన్నతాధికారులు, ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.



నగర పాలక సంస్థ కార్యాలయ భవనం

### విద్యుదాఘాతంతో యువకుడి మృతి

విడవలూరు: విద్యుదాఘాతంతో హనుమంతు (29) అనే యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ఊటుకూరులో రొయ్యల గుంతల వద్ద మంగళవారం జరిగింది. స్థానికుల సమాచారం మేరకు ఊటుకూరు గ్రామానికి చెందిన హనుమంతు రొయ్యల గుంతల వద్ద నడిచి వెళ్తుండగా ఏయిరేటర్ల కోసం ఏర్పాటు చేసి విద్యుత్ వైర్లు ప్రమాదవశాత్తు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# యువకుడి దారుణ హత్య

- మద్దతుగా తీసుకెళ్లిన వాళ్ల చేతిలోనే హతమైన వైనం
- మరో ఇద్దరికి కత్తి పోట్లతో తీవ్రగాయాలు
- పందుల అపహరణ వ్యవహారంపై ఇరువర్గాల ఘర్షణ
- కోవూరు రాళ్లమిట్టలో ఉద్రిక్తత
- లాఠీచార్జి చేసి ఇరువర్గాలను చెదరగొట్టిన పోలీసులు

కోవూరు: ఇరువర్గాల మధ్య ఘర్షణలో విచక్షణ కోల్పోయిన ఒక వర్గం కత్తిపోట్లకు తెగబడడంతో అదే వర్గంలోని ఓ యువకుడు హతమయ్యాడు. మరో వర్గానికి చెందిన ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన కోవూరు రాళ్లమిట్ట ప్రాంతంలో మంగళవారం జరిగింది. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. భారీగా పోలీసులు మోహరించి లాఠీచార్జి చేయడంతో పరిస్థితులు అదుపులోకి వచ్చాయి. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు నగరంలోని వెంకటేశ్వరపురం గాంధీగిరిజన కాలనీ ప్రాంతానికి చెందిన రమేష్, నాగరాజు, శ్రీను అలియాస్ అరవోడు ఈ ముగ్గురు కోవూరు జంగంవీధి సమీపంలో మంగళవారం తెల్లవారుజామున పందులు అపహరించేందుకు ప్రయత్నించారు. కోవూరు రాళ్లమిట్టకు చెందిన పందుల యజమానులు హరి, శ్రీనివాసులు, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం కలిసి వారిని పట్టుకుని కోవూరు బజారు సెంటర్‌కు తీసుకువచ్చారు. పందుల అపహరణపై యజమానులు గాంధీగిరిజన సంఘంలోని పందులు పెంపకందారుల కుల పెద్ద పెంచలయ్య దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అతను కోవూరు సెంటర్‌కు చేరుకుని ఇరువర్గాల మధ్య మధ్యస్తం చేసేందుకు ప్రయత్నించాడు. మా ప్రాంతంలో పోలేరమ్మకు పొంగళ్లు పెట్టుకుంటున్నామని, అప్పటి వరకు నాగరాజు సెల్‌ఫోన్, స్కూటీని మీ వద్ద పెట్టుకోవాలని రాళ్లమిట్టకు చెందిన పందుల యజమానులకు చెప్పి వెళ్లిపోయాడు. ఆ తర్వాత 10.30 గంటల సమయంలో నాగరాజు గాంధీగిరిజన కాలనీకు చెందిన దుర్గయ్య (జుట్టోడు), కోటేశ్వరరావు (బొచ్చోడు)ను తీసుకుని రాళ్లమిట్టకు చేరుకున్నాడు. అక్కడ పందుల యజమానుల్లో ఒకరైన మన్నేపల్లి రామకృష్ణ తన ఇంటి ముందు నిలబడుకుని ఉండగా దుర్గయ్య, కోటేశ్వరరావు అతనితో వాగ్వాదం పడ్డారు. ఇంతలో దుర్గయ్య కత్తితో రామకృష్ణపై దాడి చేశాడు. వారిని అడ్డుకోబోయిన మన్నేపల్లి రాంభీకి కత్తి పోట్లు పడ్డాయి. దీంతో వీరు తీవ్రంగా గాయపడడంతో భయపడిన నాగరాజు (25) తన వాళ్లను అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో దుర్గయ్య, కోటేశ్వరరావు అతన్ని పొడిచారు. దీంతో నాగరాజు అక్కడికక్కడే హతమయ్యాడు. మృతుడికి భార్యతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. భర్త హత్యతో తన బిడ్డలకు నాన్న ఎక్కడ అంటే ఏం చెప్పాలంటూ భార్య కన్నీరుమున్నీరుగా రోదించింది. హత్య జరగడంతో ఇరువర్గాలు దాదాపు 60 మందికి పైగా చేరుకోవడంతో రాళ్లమిట్టలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.



హత్యకు గురైన నాగరాజు

**పోలీసుల లాఠీచార్జి**

సమాచారం అందుకున్న కోవూరు సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ రంగనాథగౌడ్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే విచక్షణ కోల్పోయి ఇరువర్గాలు ఘర్షణ పడుతుండగా పోలీసులు వారిని చెదరగొట్టేందుకు ప్రయత్నించారు. దీంతో వారు పోలీసులనే నెట్టివేయడంతో లాఠీచార్జి చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఒక వర్గం కత్తిపోట్ల దాడిలో తీవ్రంగా గాయపడిన మన్నేపల్లి రామకృష్ణ, రాంభీలను చికిత్స నిమిత్తం నెల్లూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న నెల్లూరు రూరల్ డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి, కోవూరు, బాలాజీనగర్, నెల్లూరు సంతపేట సీఐలు శ్రీనివాసరావు వీరనాయక్, బాబీ, కోవూరు ఎస్‌ఐ రంగనాథగౌడ్ తన సిబ్బందితో కలిసి విచారణ చేపట్టారు.



ఘటనా స్థలంలో విచారిస్తున్న పోలీసులు

**పోలీసుల అదుపులో నిందితులు?**

కోవూరు రాళ్లమిట్టలో హత్య కేసులో నిందితులు దుర్గయ్య (జుట్టోడు), కోటేశ్వరరావు (బొచ్చోడు) పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. ఈ ఘటన అనంతరం నిందితులు పరారయ్యారు. కోవూరు సీఐ శ్రీనివాసరావు ఎస్‌ఐ రంగనాథ్‌గౌడ్, సిబ్బందితో రెండు బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలించారు. నిందితులిద్దరు హత్య చేసి తర్వాత వెంకటేశ్వరపురం సప్తగిరి బార్‌లో మద్యం తాగి సమీపంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద ఉన్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. హత్యకు దారితీసిన పరిస్థితులను తెలుసుకునేందుకు నిందితులను విచారిస్తున్నారు.